ఘనంగా కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలు

కాప్రా: కార్ల్‌మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి శిరోధార్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీఎస్.బోస్ అన్నారు. సోమవారం ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్ల్‌మార్క్స్ ఆయన జీవిత కాలమంతా విస్తృతమైన పరిధిలో మార్కిస్ట్ సిద్ధాంతాన్ని అనుసరించాడన్నారు. మార్క్స్ అతని సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి చరిత్ర భౌతికవాద అవగాహనను రూపొందించాడని, అదే చారిత్రక భౌతికవాదంగా పేరు గాంచిందని తెలిపారు. సీపీఐ, ఏఐటీయూసీ నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, నరసింహ, రాఘవేంద్రరావు, సత్యప్రసాద్, సాయిలు, అశోక్, కిరణ్, రాకేష్ తదితరులున్నారు.

కుట్టు మెషిన్ల పంపిణీ



మల్లాపూర్: సూర్యనగర్‌లోని సబల మహిళా నైపుణ్యాభివృద్ధి సంస్థలో మూడు నెలల పాటు మహిళలు టైలరింగ్ శిక్షణ పొందారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మెషిన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మోడ్రన్ హై స్కూల్ ఫౌండర్ ముత్యంరెడ్డి, జన ప్రగతి సేవ చారిటబుల్ ట్రస్ట్ శరత్‌చంద్ర హాజరై మెషిన్లను అందజేశారు. ఉచితంగా కుట్టు మెషిన్ల అందించిన ఎక్స్‌ట్రా మైల్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ నాగమోహన్, జో మరియా, జోసెఫ్, కోటేశ్వరరావుకు సబల సెంటర్ హెడ్ సరిత, నరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంకు ఆహ్వానం



సీఎంతో కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: ఉప్పల్ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత బోరంపేట కృష్ణముదిరాజ్ కుమారుడు విశ్వతేజ్ వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్‌లు సీఎంను కలిసి శుభలేఖను అందజేశారు.

పనులకు టెండర్లు పిలవండి



జలమండలి జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: భూగర్భ డ్రైనేజీ పనులకు టెండర్లను పిలవాలని జలమండలి జీఎం సంతోష్‌కు సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులకు టెండర్లను పిలువలేదన్నారు. తొందరగా టెండర్ ప్రకియ పూర్తి చేసి పనులను ప్రారంభించాలని జీఎంను కోరారు.

బేస్‌మెంట్ల తొలగింపు

బోడుప్పల్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన మూడు బేసిమెంట్లను సోమవారం మండల రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను నిత్యం రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం చర్లపల్లి, మింట్ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప స్థానికులు సత్తిరెడ్డి, స్వామి, గణేష్, శంకర్, తిరుపాల్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

శివారుల్లో రిబేట్ రాబడి రూ.103.74 కోట్లు

2025–26 ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

పురపాలికల్లో ప్రజల స్పందనతో అత్యధిక రాబడి



సాక్షి, సిటీబ్యూరో: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 28.60 శాతం పన్నులు అంటే.. రూ.103.74 కోట్లు ప్రజలు చెల్లించడంతో మున్సిపల్ శాఖ అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తం అవుతోంది. 33 రోజులు మాత్రమే ఐదు శాతం పన్ను రాయితీ వర్తింపు ఉండటంతో.. ప్రజల నుంచి చెల్లింపులు అంచనాకు వచ్చినట్లు భావిస్తున్నారు.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై సర్కారు ఏప్రిల్ ఒకటి నుంచి మే 3 వరకు ఐదు శాతం రాయితీ ప్రకటించటంతో.. ఆశించిన మేర ఆదాయం రాబడి ఉన్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీల్లో విస్తృతంగా పన్ను రాయితీపై ప్రచారం నిర్వహించి ఉంటే వసూళ్లు పెరిగేవి అనే అభిప్రాయాలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు శాతం పన్ను రాయితీ వసూలైన పన్నుల రాబడి వివరాలు ఈ విధంగా ఉన్నాయి

- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.31.60 కోట్లకు రూ.8.98 కోట్లు (28.43 శాతం) వసూలు కాగా,
- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.38.14 కోట్లకు రూ.12.96 కోట్లు (33.97శాతం) పన్నులు,
- జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.15.38 కోట్లకు రూ.2.35 కోట్లు (15.28శాతం),
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.78.08 కోట్లకు రూ.26.00 కోట్లు (33.31 శాతం) పన్నులు వసూలయ్యాయి.
- అలాగే, మున్సిపాలిటీలు పోచారంలో రూ.27.71 కోట్లకు రూ.4.28 కోట్లు (15.47 శాతం) పన్నులు వసూలు కాగా,
- తూముకుంటలో రూ.18.32కోట్లకు రూ.6.70 కోట్లు(36.59 శాతం),
- నాగారంలో రూ.22.61 కోట్లకు రూ.7.40కోట్లు (32.72శాతం),
- మేడ్చల్‌లో రూ.16.07కోట్లకు, రూ.5.05కోట్లు (31.42శాతం),
- కొంపల్లిలో రూ.17.99 కోట్లకు, రూ.5.11 కోట్లు(28.43శాతం),
- ఘట్‌కేసర్ రూ.11.14 కోట్లకు, రూ.2.03 కోట్లు (18.22శాతం),
- గుండ్లపోచంపల్లిలో రూ.21.35కోట్లకు, రూ.7.76కోట్లు(36.38శాతం),
- దమ్మాయిగూడలో రూ.23.27కోట్లకు, రూ.3.91 కోట్లు(16.82శాతం),
- దుండిగల్ మున్సిపాలిటీలో రూ.40.99కోట్లకు, రూ.11.16 కోట్లు (27.24శాతం) పన్నులు వసూలయ్యాయి.
- జిల్లాలో మొత్తం రూ.362.70 కోట్లకు గానూ రూ.103.74 కోట్లు(28.60 శాతం) వసూలయ్యాయి.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో సుమారు 60 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయి. మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకాలు కొండంత భరోసానిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాములు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, రావుల అంజయ్య, జీకే హన్మంతరావు, అమీనుద్దీన్, మురుగేష్, శివకుమార్, భాగ్యానంద్, సతీష్, నర్సింగ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్

మౌలాలి: డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో రూ.21 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో ఇదే ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ పనులు కూడా తామే చేపట్టామని అన్నారు. డివిజన్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. మౌలాలిని ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, శివగౌడ్, లింగారావు, మహేష్, వీరేంద్ర, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి’!



కుషాయిగూడ: కాప్రా మండలం, కుషాయిగూడ సర్వేనెంబరు 270/1లో 30 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధి పద్మారెడ్డి ఆరోపిస్తున్నారు. గతంలో కబ్జాకు యత్నించగా.. సాయినగర్ కుటుంబాల ఫిర్యాదుతో అప్పటి మంత్రి కేటీఆర్ జోక్యంతో కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమికి కంచెను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. చాలా రోజులుగా అటు వైపుగా చూడని కబ్జారాయుళ్లు గత ఆదివారం నుంచి చేతికి పని చెప్పారు. తిరిగి ప్రభుత్వ స్థలంలో జేసీబీలతో చెట్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు. జిల్లా కలెక్టర్, కాప్రా మండల రెవెన్యూ అధికారులు స్పందించి కోట్లాది రూపాయాలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని వారు కోరుతున్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. డివిజన్ పరిధిలోని నవోదయనగర్‌లో సోమవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డివిజన్‌లో సీసీరోడ్లతో పాటు మౌలిక వసతులు అవసరమైన కాలనీలను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతూ ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేసి సీసీరోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏఈ లింగరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, కాలనీ అధ్యక్షుడు కత్తుల రాజ్‌కుమార్, జయపాల్, లింగం, జమాలయ్య, నాగరాజు తదితరులున్నారు.

కారిడార్ పనుల జాప్యంపై కేంద్రమంత్రికి వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు నగరానికి వచ్చిన కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గట్కరీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమై ఏడేళ్లు గడుస్తున్నా.. ఇంకా 30 శాతం పనులు కూడా పూర్తికాలేదని, దీంతో ఇక్కడి ప్రజలే కాకుండా వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల నడుపుతున్న వారు కూడా నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కారిడార్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి త్వరలో పనులు పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికి 20 చలివేంద్రాలు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: ప్రజల దాహార్తిని తీర్చడానికి నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో 20కి పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రతకు పనుల నిమిత్తం ప్రయాణం చేసే ప్రజలకు చల్లటి తాగునీటిని అందించాలనే సంకల్పంతో నియోజకవర్గంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

అల్వాల్: మురళీకృష్ణ కాలనీలోని సాయిసూర్య ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. సోమవారం శోభాయాత్ర, జలాధివాస ఉత్థాపన, మహాస్నపన కలశ స్థాపన, చండీ హోమం, ధాన్యాధివాసం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ తెగుళ్ల సనాతన సారథి కృష్ణ యజుర్వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనందబాబు, ప్రొద్దుటూరు నాగేశ్వర్‌రావు, అమర శ్రీను, ఉప్పల రాంబాబు, గంగాధర్, పెద్ది రమేష్, శివ, ఆలయ ధర్మకర్తలు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించిన స్థానిక నేతలు



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఈదురు గాలులకు చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో కూలిన సీలింగ్ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం టెర్మినల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యంతో చోటుచేసుకున్న ఘటనపై రైల్వే అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. కోట్లాది రూపాయాలతో నిర్మించిన టెర్మినల్‌లో నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకపోవడం దురదుష్టకరమన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణహాని జరగలేదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని రైల్వేస్టేషన్ అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రఘు తదితరులున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో కూలిన సీలింగ్ ఘటనను నిరసిస్తూ సీపీఎం మేడ్చల్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రశేఖర్, ఎర్ర అశోక్, శ్రీనివాసులు, రాజశేఖర్, వెంకన్న, గణేష్, చంద్రశేఖర్, కార్తీక్, అవినాష్ తదితరులున్నారు.

ఏపీ డిప్యూటీ స్పీకర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

గౌతంనగర్: ఏపీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు చేసిన వ్యాఖ్యలను నిరసనగా మల్కాజిగిరి చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు కృపాసాగర్ మాట్లాడుతూ.. రఘురామరాజుకు డిప్యూటీ స్పీకర్‌గా ఉండే అర్హత లేదని, రాజ్యాంగం మీద చేసిన ప్రమాణాలు పాటించడం లేదని దుయ్యబట్టారు. సీపీఎం నేతలపై ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, నాయకులు కొండలు, విజయకుమార్, శ్రీనివాస్, సూర్యకుమార్, సరోజ, స్వాతి, భూమయ్య, రమేష్, రవినాయక్, యాకయ్య, రాములు తదితరులున్నారు.

గురుకుల్ అభివృద్ధికి ఉత్తరాల ఉద్యమం

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని పూర్వ విద్యార్థులు ఉత్తరాలు పంపారు. గురుకుల్‌కు పూర్వవైభవం తేవాలని, గురుకుల్ ఆవరణలో నిర్మాణాలు చేపట్టి పేద విద్యార్థులకు కేజీ–పీజీ వరకు ఉచిత విద్య అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సోమవారం లేఖలు పంపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌యాదవ్, సురేశ్, కుమార్, అభిలాశ్‌యాదవ్, యష్‌పాల్, ప్రశాంత్, జగదీశ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

రామన్నపేట: ఆటో బోల్తా పడి ఏడుగురు వ్యక్తులు గాయపడిన ఘటన సోమవారం రామన్నపేట మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరం, రామంతాపూర్‌కు చెందిన రెండు కుటుంబాలు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం కొండ గడపలో ఆదివారం జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు వెళ్లారు. సోమవారం ఆటోలో రామాంతాపూర్‌కు తిరిగి వెళ్తుండగా.. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ శివారులోని కోళ్లఫామ్ వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న జ్యోతి, వైష్ణవి, గంగమ్మ, వెంకటేష్, కొండయ్యతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రికి తరలించారు.



‘జారుడు మెట్లు’ నాటక ప్రదర్శన



మల్లాపూర్: రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ, తెలుగు వెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ సంయుక్తాధ్వర్యంలో ‘జారుడు మెట్లు’ సందేశాత్మక నాటికను సోమవారం మల్లాపూర్ నెహ్రూనగర్ హనుమాన్ దేవాలయం వద్ద ప్రదర్శించారు. ఈ నాటికలో రక్తకన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘువ బిరుదు గ్రహీత మాడుగుల కృష్ణమోహన్, రమేష్‌గౌడ్, గోవింద్ సత్యనారాయణ, గోపాలకృష్ణ, నాగరాజు, మనుప్రియ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని 23వార్డుకు చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన భాస్కర్‌రెడ్డికి రూ.26 వేల ఆర్థిక సాయం మంజురు కావడంతో ఆ చెక్కును ఆయన నివాసంలో అందజేశారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ సోమవా రం కోరారు. ఈమేరకు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. శ్రీసాయిగణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, పార్కు జాగాలో కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఈటల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, బొడ్డు నాయక్, మనోహర్‌రెడ్డి, సదానందం, రాజేశం, రామాంజనేయులు, గోపీకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో అధిక ఆదాయం

పోచారం: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతాపసింగారంలోని వార్డు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఎంతో సేవ చేస్తోందని కొనియాడారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. వరి పంటలో కాండం తొలుచు పురుగు, పురుగు మందు అవశేషాలు లేని పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జె.సురేష్ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు వాడితే అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి ఎండీ బాసిత్ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందుంటాయని చెప్పారు. అనంతరం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సుదీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఏఈఓ జె.మంజుల, ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, రైతులు సుభాష్‌రెడ్డి, అంజయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: రైతులకు అధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం మేడ్చల్ మండలంలో సోమవారం ప్రారంభమైంది.

కీసర: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కీసర మండల వ్యవసాధికారి మాధవిలత ఆధ్వర్యంలో భోగారం గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగహన సదస్సులో శాస్త్రవేత్తలు శ్రీదేవి, సందీప్, విక్రం తదితరులు మాట్లాడుతూ వరి పంటలో రకాలు, వాటి దిగుబడి, యూరియా, క్రిమిసంహాకర మందుల వాడకం, చీడపీడల నివారణకు చర్యలు తదితర వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి వందన, రైతులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571